# రక్తదానం ప్రాణదానంతో సమానం: డాక్టర్ పీవీవీ ప్రసాద్

### ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం

### రక్తదాతలను జ్ఞాపికలతో సత్కరించిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్

**శేరిలింగంపల్లి : జూన్ 14, (ప్రభాత ఉదయం)**

సైన్స్ ఎంత అభివృద్ధి చెందినా రక్తాన్ని ల్యాబొరేటరీల్లో తయారుచేయలేమని అది కేవలం మానవ శరీరంలోనే ఉత్పత్తి అవుతుందని కాబట్టి రక్తదానం చేయడం అంటే మరొకరికి పునర్జన్మ ఇవ్వడమేనని భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ రిటైర్డ్ డైరెక్టర్ డాక్టర్ పీవీవీ ప్రసాద్ అన్నారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఆదర్శ్ నగర్ కాలనీ కమ్యూనిటీలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ప్రసాద్ సమాజంలో అత్యధిక పర్యాయాలు రక్తదానం చేసి ఎందరో ప్రాణాలను కాపాడిన కర్మయోగులను, పుణ్యమూర్తులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ పీవీవీ. ప్రసాద్ మాట్లాడుతూ రక్తం దేహం అనే యంత్రానికి ఇంధనం వంటిది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జూన్ 14న ఒక ప్రత్యేక నినాదంతో ఈ రోజును నిర్వహిస్తోంది. ఈ ఏడాది మానవత్వపు ఒక చుక్క రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి అనే నినాదంతో ముందుకు సాగుతున్నమన్నారు. స్వచ్ఛంద రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి వారిని చైతన్యపరచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. గర్భిణులు, తలసీమియా బాధితులు, ప్రమాదాల క్షతగాత్రులు, సైనికులకు రక్తం ఎంతో అవసరమని, అయితే దేశంలో అవసరానికి తగినంత రక్తం లభ్యత లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ జనాభాలో 50 శాతం మంది రక్తదానానికి అర్హులైనప్పటికీ ప్రతి వెయ్యి మందిలో కేవలం ఐదుగురు మాత్రమే ముందుకు రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. 18 నుండి 60 సంవత్సరాల వయస్సు ఉండి కనీసం 45 కేజీల పైన బరువున్న సంపూర్ణ ఆరోగ్యవంతులైన స్త్రీ, పురుషులు రక్తదానం చేయవచ్చున్నారు. పురుషులు ఏడాదికి 3 నుండి 4 సార్లు, మహిళలు 2 సార్లు సురక్షితంగా రక్తదానం చేయవచ్చని వివరించారు.



రక్తదానం చేసిన దాతలను సన్మానించిన ఫ్రెండ్స్ సభ్యులు

రక్తదానం చేయడం వల్ల కేవలం ఎదుటివారి ప్రాణాలు కాపాడటమే కాకుండా దాతకు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని డాక్టర్ ప్రసాద్ వివరించారు. ఇది శరీర బరువును అదుపులో ఉంచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడుతుంది. అలాగే గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాల బారిన పడకుండా కాపాడటంతో పాటు మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు.

మానవ రక్తంలో గ్రూపులను కనుగొని 1930లో నోబెల్ బహుమతి పొందిన ప్రముఖ జీవశాస్త్రవేత్త, వైద్యుడు కార్ల్ ల్యాండ్ స్టీనర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన గౌరవార్థం ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. పోలియో వైరస్ గుర్తింపులోనూ ఆయన సేవలు అనన్యసామాన్యమైనవని కొనియాడారు. ఈ సందర్భంగా సమాజంలో రక్తదానం పట్ల అపోహలు తొలగించి స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహిస్తామని ప్రతినిధులందరితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా డీవీఎన్ రాజు పాల్గొనగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జీ వీ రావు, అమ్మయ్య చౌదరి, బాలన్న, శ్రీనివాసులు, మంగళంపల్లి మూర్తి, శ్రీనివాస్, కుర్రా మహేష్, బోయిన మహేష్ యాదవ్, శ్రీ చందన, ఉమా చంద్రశేఖర్, బాలాజీ, విష్ణుప్రసాద్, జిల్ మల్లేష్, రామారావు, బసవరాజు, చప్పిడి కృష్ణ, ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.

# 'బడి బాట'తోనే బాలల భవిష్యత్తు బంగారు మయం

### డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా అవగాహన సదస్సు

### ప్రభుత్వ స్కూళ్లలోనే ప్రతిభా పాఠాలు: ప్రొఫెసర్ రాందాస్ రూపావత్

**శేరిలింగంపల్లి : జూన్ 14, (ప్రభాత ఉదయం)**

సమాజంలో ఏ ఒక్క చిన్నారి కూడా చదువుకు దూరం కాకూడదనే మహత్తర ఆశయంతో 'డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ'ఆధ్వర్యంలో నిర్వహించిన "బడి బాట" విద్యా అవగాహన కార్యక్రమం అత్యంత విజయవంతంగా ముగిసింది. స్థానిక గోకుల్ ప్లాట్స్‌లో జరిగిన ఈ సదస్సుకు విద్యావంతులు, సామాజికవేత్తలు, స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రాజకీయ శాస్త్ర విభాగం ప్రొఫెసర్ రాందాస్ రూపావత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో ఉన్న అపోహలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు ప్రభుత్వ బడుల్లో ఉచిత విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్స్, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం వంటి ఎన్నో అద్భుతమైన సౌకర్యాలు ఉన్నాయని గుర్తు చేశారు. నేను దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపీఎస్) అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నాను. ఈ రోజు విజయం సాధిస్తున్న వారిలో సగానికి పైగా ప్రభుత్వ, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో చదివిన వారే ఉన్నరన్నారు. గ్రామీణ, పేద కుటుంబాల పిల్లలు సైతం పట్టుదలతో చదివితే అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని విద్యార్థుల్లో సరికొత్త స్ఫూర్తిని నింపారు. పేదరికాన్ని తరిమికొట్టే ఆయుధం 'విద్యే' అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ సామాజికవేత్త టి. రామస్వామి యాదవ్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపమని, దానికి స్వస్తి పలికి ప్రతి చిన్నారిని బడికి పంపాలని పిలుపునిచ్చారు. ఒక కుటుంబంలోకి విద్య ప్రవేశిస్తే ఆ కుటుంబ భవిష్యత్తే మారిపోతుందని, పేదరికంపై పోరాడేందుకు చదువే అత్యంత శక్తివంతమైన ఆయుధమని స్పష్టం చేశారు. డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ వ్యవస్థాపకురాలు చావా అరుణ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఐదేళ్ల లోపు పిల్లల కోసం ప్రీ-ప్రైమరీ విద్యా సౌకర్యాలు కూడా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్క తల్లిదండ్రూ వినియోగించుకుని తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. బడి వయసు పిల్లలందరినీ బడిలో చేర్పించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. సొసైటీ ఇన్-హౌస్ పీడియాట్రిషన్ దేవయాని పిల్లలకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే చేతులు శుభ్రంగా కడుక్కోవడం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ నిర్వహిస్తున్న క్లినిక్ ద్వారా అవసరమైన చిన్నారులందరికీ ఉచిత వైద్య సహాయం అందిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, ఐటీ రంగ నిపుణులు, యువత, స్వచ్ఛంద కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్వచ్ఛంద ఉపాధ్యాయులు జయలక్ష్మి, వివేక్, స్థానిక నివాసి గుమ్మడి శ్రీను కార్యక్రమ విజయవంతానికి తమ మద్దతును అందించారు. ప్రతి చిన్నారి పాఠశాల బాట పట్టే వరకు మా ప్రయాణం ఆగదని సొసైటీ ప్రతినిధులు ప్రతిన బూనారు.




చదువు పై అవగాహన కల్పించడం కోసం "బడిబాట" ర్యాలీ చేస్తున్న డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ నిర్వాహకులు చిన్నారులు..

# దేశ ప్రగతిలో విద్యావంతులు భాగస్వాములు కావాలి: ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



దివ్య శక్తి రెసిడెన్సీ లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ విశేషాలు రెడ్డి శేర్లింగంపల్లి ఇన్చార్జ్ బిజెపి నాయకులు రవికుమార్ యాదవ్..



ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు

### దివ్య శక్తి రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వాసులతో ముఖాముఖి

### సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం: రవికుమార్ యాదవ్

**శేరిలింగంపల్లి : జూన్ 14, (ప్రభాత ఉదయం)**

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని అభివృద్ధి విషయంలో మాత్రం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని 'దివ్య శక్తి రెసిడెన్సీ' అపార్ట్‌మెంట్ వాసులతో ముఖాముఖి కార్యక్రమంలో ఎంపీ తోపాటు శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బిజెపి ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్‌తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో సానుకూల మార్పు కోసం 'వికసిత్ భారత్' లక్ష్య సాధన కోసం మేధావులు, చదువుకున్న విద్యావంతులు దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఎదుగుతోందని కొనియాడారు. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా ద్వారా స్వదేశీ వస్తువుల తయారీకి కేంద్రం పెద్దపీట వేసింది. నగరాల్లో స్వచ్ఛమైన తాగునీటి కోసం 'అమృత్ 2.0' పరిసరాల పరిశుభ్రత కోసం 'స్వచ్ఛ భారత్' ఆరోగ్యంపై అవగాహన కోసం 'ఫిట్ ఇండియా' వంటి ఎన్నో అద్భుతమైన పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ స్కీమ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు విద్యావంతులు సద్వినియోగం చేసుకుంటే దేశం మరింత వేగంగా అగ్రస్థానానికి చేరుకుంటుందిదేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి ఉన్న సంపూర్ణ మద్దతును గుర్తు చేస్తూ రాష్ట్రంలో, మన డివిజన్‌లో, అలాగే ప్రతి బూత్ స్థాయిలోనూ బీజేపీ బలోపేతానికి విద్యావంతులు తమ సంపూర్ణ మద్దతును అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ చిట్ చాట్ కార్యక్రమం ఎంతో అర్థవంతంగా సాగిందని, ఎన్నో మంచి విషయాలను పంచుకునే అవకాశం కలిగిందని ఎంపీ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ కమ్యూనిటీ వాసులు తమ ప్రాంతంలోని మెరుగైన రహదారులు, ట్రాఫిక్ ఇబ్బందులు, క్లబ్ హౌస్ సమస్య, భూకబ్జాల వంటి పలు సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై శేరిలింగంపల్లి ఇన్‌ఛార్జ్ రవికుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ ఈ సమస్యలన్నింటినీ సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సహకారాలు, సూచనలు, ఆశీస్సులు ఉంటే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ముఖాముఖి కార్యక్రమంలో దివ్య శక్తి అపార్ట్‌మెంట్ వాసులు, అసోసియేషన్ సభ్యులతో పాటు బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్, ముఖ్య నాయకులు మహేష్, మాణిక్ రావు, సీతారామ రాజు, పట్టాభిరామ్, గణేష్, శ్రీను, విజయేందర్, ప్రసాద్, శ్రీనివాస్, రాము, రవీందర్ నాయక్, నాగులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామ పరిశుభ్రత మనందరి బాధ్యత

### బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణారెడ్డి

### రైల్వే సబ్ కాంట్రాక్టర్ రాజు సహకారంతో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద మురుగునీటి తొలగింపు.

### వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు నిలిచిన అంతరాయం.

### తక్షణమే స్పందించి సైడ్ కాల్వ తీయించిన యువత, రైల్వే సిబ్బంది.

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(ప్రభాత ఉదయం)**

పరిసరాల పరిశుభ్రత అనేది కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామ ప్రజలందరి సామాజిక బాధ్యత అని కేటీ దొడ్డి మండల బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కింద మురుగునీరు, వర్షపు నీరు భారీగా నిలిచిపోయాయి. దీనివల్ల గ్రామం నుండి రాకపోకలు సాగించే వాహనదారులకు, ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన గాజుల కృష్ణారెడ్డి, టి.రాజు తక్షణమే స్పందించారు. రైల్వే సబ్ కాంట్రాక్టర్ రాజు మరియు కాంట్రాక్టర్ వీరాంజనేయుల ప్రత్యేక సహకారంతో, రైల్వే వర్కర్స్ టీమ్‌ను రంగంలోకి దించారు. బ్రిడ్జి కింద నిలిచిన నీరంతా బయటకు వెళ్లేలా అత్యవసరంగా సైడ్ కాల్వను తవ్వించి, నీటిని తొలగించారు. దీంతో వాహనాల రాకపోకలు తిరిగి సజావుగా సాగాయి. గ్రామస్తుల ఇబ్బందులను గుర్తించి, తక్షణమే స్పందించి శ్రమదానంతో ఈ సమస్యను పరిష్కరించినందుకు గాజుల కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సామాజిక కార్యక్రమంలో భాగస్వాములైన రైల్వే వర్కర్స్ టీమ్, సబ్ కాంట్రాక్టర్ రాజు, కాంట్రాక్ట్ వీరాంజనేయులు, డిపార్ట్‌మెంట్ రంగప్పలతో పాటు గ్రామ ప్రముఖులు బొరెల్లి రాఘవేంద్ర, ముంగిలి రాము, కర్రే పద్మారెడ్డి, గాజుల మహేష్ రెడ్డి, ముంగిలి నాగిరెడ్డి, ఊర్ల యుగంధర్, సైకిల్ వీరప్ప, గద్వాల్ రంగప్ప, గుడిసె గోపి, చాకలి రాము, నారం మహేందర్, డ్రైవర్ యుగంధర్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(ప్రభాత ఉదయం)**

ప్రతి ఒక్కరి జీవితంలొ స్నేహితుల పాత్ర కీలకం ఆట పాటలు, చిలిపి పనులు కష్టం, సుఖం ఇలా ఏదైనా కాని మన వెన్నంటే ఉండి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పేదే ఒక స్నేహం. ఆనందం, బాల్యం, స్మృతులు, కరచాలనాలు, చెమ్మగిల్లిన కళ్ళతో అలింగనాలు గురువుల మందలింపులు తలుచుకుంటూ ఒకసారి వయస్సు మరచి పోయి చిన్న పిల్లల కేరింతలతో మల్దకల్ కన్యకపరమేశ్వరీ ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. ఈ ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే మల్దకల్ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1994-95 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగల మారింది. 31 సంవ్సరాల తర్వాత ఎక్కడెక్కడికో వెళ్ళిన వారు కొందరు, ఎక్కడెక్కడో స్థిర పడిన వారు కొందరు, ఉద్యోగాల్లో కొందరు, సహధర్మచరినిలుగా కొందరు, వివిధ స్తితుల్లో జీవిస్తూ తమ మిత్రులను కలవాలనే కలంపులో ఆనాటి విద్యార్థులైన కొంత మంది విద్యార్థులకు ఆలోచన కలిగింది. ఈ సమ్మేళనంలో తమ గురువుల బోధనలు తమ కుటుంబ పరిస్థితులు నాటి చిలిపి చేష్టలను క్రమశిక్షణ పేరుతో గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు పాటలు అలరించాయి. వచ్చిన పూర్వ విద్యార్థులు ఆవరణలో పొద్దు పోయే వరకు గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్య స్థానాలకు వారు కదిలారు. అంతకు ముందు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.




# అశాస్త్రీయ వేతన సవరణను పూర్తిగా వ్యతిరేకిస్తున్నాం

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 14(ప్రభాత ఉదయం)**

కార్మిక సంఘాల అభిప్రాయాలను, కార్మికుల జీవన పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ప్రకటించిన ఆశాస్త్రియ వేతన సవరణను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని సిఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం గద్వాల పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రకటించిన వేతన సవరణ పూర్తిగా అశాస్త్రీయంగా ఉందని కార్మికుల కుటుంబాన్ని, కార్మికుల జీవన పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వ అనుకూల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసుకొని, కనీస వేతనాలు ప్రకటించడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన వేతన సవరణలో ఇప్పటికే కొన్ని అమలులో ఉన్నాయని, ప్రభుత్వం కొత్తగా కార్మికులకు వేతనాలు పెంచింది ఏమి లేదని విమర్శించారు. కార్మికుల విద్యా వైద్యం రోజువారి జీవనం కొనసాగించడానికి, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26,000 ఇవ్వాలని కార్మిక సంఘాల దశాబ్దాల నుండి పోరాడుతున్న ప్రభుత్వం పట్టించుకోకపోగా కార్మికులను మభ్యపెట్టే రీతిలో ప్రకటించిన వేతనాల సవరణ పూర్తిగా అశాస్త్రీయంగా ఉందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీసం నెల నెల వేతనాలు సైతం సక్రమంగా ఇచ్చే పరిస్థితి లేకపోవడం అన్యాయం అన్నారు. జూన్ 20న మహబూబ్నగర్ లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలకు కార్మిక వర్గం మద్దతుగా కలిసి రావాలని కోరారు. తక్షణమే ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాల ప్రకటనను వెనకకు తీసుకొని, కనీస వేతనం 26000 ప్రకటించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం లో సిఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉప్పేర్ నరసింహ వీవీ నరసింహ జిల్లా ఉపాధ్యక్షులు ఏమెలమ్మ, ఘట్టన్న, సహాయ కార్యదర్శులు తిమ్మప్ప, ఈశ్వర్ పాల్గొన్నారు.

